క్లుప్తంగా

సీబీఎస్ఈలో ఉత్తమ ఫలితాలు


శ్రీనిధి


జే. లితీషా


రాహుల్ కుమార్ రెడ్డి

అలంపూర్: సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో మాంటిస్సోరి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. పాఠశాలకు చెందిన శ్రీనిధి 490 మార్కులు సాధించి ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోనే మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. జె.లితీషా 486 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్, పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెవాలని ఆకాంక్షించారు. పదో తరగతి ఇన్‌చార్జి సత్తార్ వలి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన రాహుల్ కుమార్‌రెడ్డి 483 మార్కులు సాధించి అత్యధిక ప్రతిభను కనబర్చారు. దీపికారెడ్డి 476, హన్సిత 472, సంతోష్ 467, చందన 463 మార్కులు సాధించారు. అధిక ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

అయిజలో 19 సెం.మీ. వర్షపాతం



అయిజ: వేసవిలో ఎండ వేడికి అల్లాడిపోయిన ప్రజలకు తెల్లవారుజామున కురిసిన వర్షానికి ధరణి తడిసి ముద్దయింది. మండలంలో 19 మి.మీ. వర్షం కురిసింది. గత బుధవారం తొలిసారి వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. 42 డిగ్రీలకు పైగా ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు వరుణుడు ఉపశమనం కలిగించాడు. 2వ సారి సోమవారం వరణుడు కరుణించాడు. మండలంలోని కొన్ని శివార్లలోని చెరువులకు నీరు చేరింది. వానలు పడడంతో రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. నెలరోజుల క్రితం సాగుచేసిన వేరుశనగ పంటకు వర్షం ప్రాణం పోసింది. వరుణుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.


చిన్నతాండ్రపాడు చెరువుకు చేరిన వర్షం నీరు

గట్టులో 75.86 శాతం..


ఆలూరులో ఓటు హక్కును వినియోగించుకున్న శాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడు

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వర్షం కారణంగా పోలింగ్ కేంద్రానికి ఓటర్లు కాస్త ఆలస్యంగా చేరుకున్నారు. మండలం మొత్తం 55 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గట్టు, సల్కాపురం, గంగిమాన్‌దొడ్డి గ్రామాలకు సంబంధించి గట్టులో 6 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, 4,590 ఓట్లకు గాను 3,482 ఓట్లు పోల్ కాగా, 75.86 శాతం నమోదైంది. గట్టులోని పోలింగ్ కేంద్రాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సందర్శించారు. జిల్లా అదనపు ఎస్పీ గుణశేఖర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీపీ విజయ్‌కుమార్ చాగదోణలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతునాయుడులు బల్గెరలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడు స్వగ్రామం ఆలూరులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈవీఎంల మొరాయింపు..

పోలింగ్ ప్రారంభమైన తర్వాత గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, బల్గెర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించగా, సాంకేతిక నిపుణులు తక్షణం అక్కడికి చేరుకుని మరమ్మతు చేసి, పున ప్రారంభించారు. దీంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర వేచి చూడాల్సి వచ్చింది.


కుటుంబ సభ్యులతో కలిసి చాగదోణలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీపీ విజయ్‌కుమార్


చాగదోణలో ఓటు కోసం బారులు తీరిన ఓటర్లు


ఎక్లాస్‌పురంలో ఓట్లు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు


అయిజలో వికలాంగుడిని ట్రై సైకిల్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది


ఓటు వేసేందుకు ట్రైసైకిల్‌పై వెళ్తున్న వృద్ధురాలు

అయిజలో..

అయిజ: పార్లమెంట్ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 80 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో 26 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయగా మండలంలోని వివిధ గ్రామాల్లో 54 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం కొన్ని పోలింగ్ బూతులలో కొన్ని నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు వాటిని సరిచేసి పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. తహసీల్దార్ జ్యోతి ఎన్నికల నిర్వాహణను పరిశీలించారు. పోలీస్ అధికారులు పహారా కాశారు. పోలింగ్ బూతుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇర్కిచేడులో పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బూత్‌లను పరిశీలించి, ఓటింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వారి వెంట నాయకులు శ్రీధర్, భగవంతు, జంగిలప్ప, ఆంజనేయులు ఉన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ప్రశాంతంగా పోలింగ్

- ఉదయం 7గంటలకు ఆరంభమైన పోలింగ్
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు
- వీల్ చైర్‌లపై కేంద్రంలోకి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు


అలంపూర్‌లో పోలింగ్ కేంద్రాల వద్ద గుంపును చెదరగొడుతున్న పోలీసులు

అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల చివరి అంకం ముగిసింది. తమ భవితవ్యాన్ని తీర్చిదిద్దే అభ్యర్థులకు ఓటర్లు మీట నొక్కి తీర్పును ప్రకటించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, పోలీసుల భారీ బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ వెలువరించిన షెడ్యూల్‌లో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు వేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. పోలింగ్ ప్రారంభించే ముందే వాతావరణం చల్లబడి చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో ఓటర్లు అరగంట పాటు ఆలస్యంగా కేంద్రాలకు చేరుకున్నారు. వర్షం తక్కువ కావడం చల్లటి వాతావరణం ఉండటంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కేంద్రాలకు బారులు తీరారు. అధికారులు ముందుగా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయడానికి అనువుగా ఈవీఎంలను సిద్ధం చేశారు. దీంతో ఉదయమే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వేశారు. వ్యవసాయ పనులు, ఇతర వ్యాపార, ఉద్యోగరీత్యా వివిధ పనులు ఉన్న వారు ఉదయమే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఓటర్లు తరలి రావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు కనిపించాయి. అందుకే నియోజవకర్గంలో మధ్యాహ్నం 1 గంటకు ఓటింగ్ 51.11 శాతానికి చేరింది. వాతావరణం చల్లగా ఉండటంతో మధ్యాహ్నం 3 గంటలకు పోలింగ్ 63.04 శాతం నమోదైంది. ఓటర్ల రాకపోకలతో పోలింగ్ కేంద్రాలు కలకలలాడాయి. ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల్లో సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కేంద్రంలోకి అనుమతిచ్చారు. పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన వారిని సమయం ముగిసిన ఓటు వేసుకోనే అవకాశం కల్పించారు. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను పోలీసులు అనుమతించలేదు. కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు సూచనలు చేశారు.


అలంపూర్‌లోని హరిజనవాడ పాఠశాలలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న ఓటర్లు


ఓటుహక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు

కేంద్రాల్లో ముందస్తు సౌకర్యాలు

ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వాహనకు పటిష్టమైన చర్యలు చేపట్టింది. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే సౌకర్యాలు కల్పించింది. తాగునీరు, నీడ వసతి కల్పించారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఎన్నికల కమిషన్ కల్పించిన సౌకర్యాలతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వలంటీర్లు వృద్ధులను, దివ్యాంగులను ప్రత్యేక వాహనాలతో పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్‌ల సంఖ్య తక్కువగా ఉండటంతో కొన్ని చోట్ల ఓటు వేయడానికి దివ్యాంగులు నిరీక్షించాల్సిన వచ్చింది.

అలంపూర్‌లో..

సమయం	శాతం
ఉదయం 9 గంటలు	9.42
ఉదయం 11 గంటలు	30.46
మధ్యాహ్నం 1 గంటలు	51.11
మధ్యాహ్నం 3 గంటలు	63.04
సాయంత్రం 5 గంటలు	71
పోలింగ్ ముగిసే సమయానికి	73.11

అలంపూర్ నియోజకవర్గంలో ఈ సారి పార్లమెంట్ పోలింగ్ శాతం భారీగా పెరిగింది. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా పార్లమెంట్ ఎన్నికల్లో 73.11 శాతం నమోదైంది. నియోజవర్గంలో మహిళా ఓటర్లు 1,21,662, పురుష ఓటర్లు 1,18,391, ఇతరులు 10 మంది మొత్తం 240063 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో నియోజవకర్గ వ్యాప్తంగా 73.11 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి 6.13 శాతం ఓటింగ్ పెరిగింది.


అలంపూర్‌లో పోలింగ్ అనంతరం కేంద్రాల నుంచి బయల్దేరుతున్న పోలింగ్ అధికారులు

మానవపాడులో..


జల్లాపురంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వేసిన జడ్పీచైర్‌పర్సన్ సరిత

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని బోరవెల్లికి చెందిన అంపిరెడ్డి 92 వయస్సులో ఇప్పటికీ 15 సార్లు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువకులు ఆనందం ఓటు వేశారు. జల్లాపురం గ్రామంలో జెడ్పీచైర్‌పర్సన్ సరిత కుమారుడు కార్తీక్ మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.


బోరవెల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్న అంపిరెడ్డి


జల్లాపురంలో మొదటి ఓటు హక్కును వినియోగించుకున్న కార్తీక్ యువకుడు.


పల్లెపాడులో క్యూ లేన్‌లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి నిలిచిఉన్న మహిళలు

ధరూరులో ప్రశాంతం..

- బూరెడ్డిపల్లిలో ఓటు వేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

ధరూరు: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పోలింగ్ మండలంలో ప్రశాతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ, అడిషనల్ ఎస్పీ మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ రితిరాజ్ గుడ్డెందొడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అడిషనల్ గుణశేఖర్, సైబర్ క్రైం డీఎస్పీ సత్తయ్యలు ధరూరు, ఎములోనిపల్లి, పెద్దపాడు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సరళిని అడిగి తెలుసుకున్నారు.

ఓటు వేసిన ఎమ్మెల్యే దంపతులు..

మండలంలోని బూరెడ్డిపల్లిలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధరూరులో మండల ఎంపీపీ నజీమున్నీసా బేగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ధరూరులో తల్లిదండ్రులతో కలిసి మొదటి సారి ఓటు వినియోగించుకున్న యూత్

ఉత్సాహంగా కొత్త ఓటర్లు..

కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉతయం నుంచి మధ్యాహ్నం ఆయా బూత్‌లలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా మంది ఓటర్లు ఓటర్ స్లిప్పులు అందలేదని తెలిపారు.


మల్దకల్‌లో ఓటు హక్కు వినియోగించుకుని సిరా గుర్తు చూపిస్తున్న మహిళలు

మల్దకల్: పార్లమెంట్ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 52 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. అమరవాయిలో రైతు పరశురాముడు వినూత్నంగా నాగలితో పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను ఆయా పార్టీలకు చెందిన నాయకులు జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలు వేరువేరుగా పరిశీలించారు. గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా అడిషినల్ ఎస్పీ గుణశేఖర్ పరిశీలించారు.

కేటీదొడ్డి: మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గంగన్‌పల్లిలో ఈవీఎం మొరాయించడంతో గంట పాటు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వెంటనే అధికారులు కొత్త ఈవీఎం ఏర్పాటు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంపీపీ మనోరమ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. చింతలకుంటలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నందిన్నె, కేటీదొడ్డిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ షాహిదాబేగం పరిశీలించారు.


కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న రంజిత్‌కుమార్ కుటుంబ సభ్యులు

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఓటర్లు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో దాదాపుగా 70 శాతం వరకు పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ నరేందర్ పేర్కొన్నారు.

ఉండవెల్లిలో 75.53 శాతం

ఉండవెల్లి: మండలంలోని 15 గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు. మండలంలో పురుషులు 8468, స్త్రీలు 8521 ఓటర్లు ఓటును వినియోగించగా, మొత్తం 16,989 మంది పోలింగ్ జరిగగా 75.53 శాతం పోలింగ్ నమోదైనట్లు సెక్టోరియల్ అధికారులు తెలిపారు. మండల కేంద్రం, కంచుపాడు, పుల్లూరు గ్రామాల్లో డీఎస్పీ సత్యనారాయణ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.


కంచుపాడులో ఓటు కోసం పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ప్రజలు

సెల్ఫీ జోరు.. ఓటరు హుషారు

- ఓటు వేసి సెల్ఫీలతో యువత ప్రచారం
- నాయకులు సైతం యువతతో సెల్ఫీలు
- ఓటు వేయడానికి క్రేజ్ పెంచిన ఫొటోలు

అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓటు వినియోగంపై వినూత్న ప్రచారం నిర్వహించింది. ఓటు వేసిన అనంతరం సిరా రాసిన చూపుడు వేలితో ఓటు వేయని వాళ్లకు చూపుతూ క్రేజ్ పుట్టించారు. దీంతో ఓటు వేయని యువత సోషల్ మీడియాలో పోస్టులను చూసి పోలింగ్ కేంద్రాల బాటపట్టారు. పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. వేసవి అయినప్పటికీ వాతావరణం చల్లబడటంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. కేంద్రాల వద్ద రద్దీ తగ్గుతున్న క్రమంలో సోషల్‌మీడియా పుణ్యమా యువతలో కొంత క్రేజ్ వచ్చింది. యువత తమ తమ సోషల్‌మీడియా గ్రూపుల్లో ఓటు వేసి వచ్చిన అనంతరం సిరా వేసిన చూపుడు వేలును చూపుతూ ఫొటోలను పోస్టు చేశారు. దీంతో ఒక్కొక్కరుగా ఓటు వేసి వచ్చి సిరాతో ఉన్న చూపుడు వేలు పెట్టి తమ ఫొటోలు పోస్టు చేశారు. ఈ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు సైతం ఓటు వేసిన అనంతరం తమ తమ అనుచర గణంతో ఫొటోలు దిగుతూ చూపుడు వేలు చూపుతూ పోస్టులు పెట్టారు. ఉదయం నుంచి ఏ గ్రూప్‌లో చూసినా ఇలాంటి ఫొటోలే అధికంగా కనిపించాయి. ఇంకొంత మంది ఓటు యొక్క ప్రాముఖ్యతను, విలువనూ వివరిస్తూ పలు సందేశాల పోస్టులతో ఓటర్లు పోలింగ్ బాట పట్టడానికి కృషి చేశారు. యువత ఉదయమే ఇలాంటి ఫొటోలతో ఇతరులు పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లడానికి జోష్ పెంచారు. జట్లు జట్లుగా ఓటు వేసి ఫొటోలను పోస్టు చేస్తుండటంతో ఇతరులు సైతం ఓటు వేయడానికి కొంత వరకు దోహదపడింది. ఎమ్మెల్యే విజయుడు తన స్వగ్రామమైన పుల్లూరులో ఓటు వేసి తన మిత్ర బృందంతో దిగిన ఫొటోలు షేర్ చేశారు. ఏది ఏమైన యువత సందేశంతో కొంత పోలింగ్ శాతం పెరగడానికి ఈ పోస్టులు తోడ్పాటును అందించాయని చెప్పవచ్చు.


పుల్లూరులో మిత్ర బృందంతో ఓటు వియోగించుకున్న ఎమ్మెల్యే విజయుడు

ఉరుములు, మెరుపులతో వర్షం

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం 7గంటల వరకు జల్లులు కురిశాయి. ఎండ వేడిమితో తల్లడిల్లిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఊరట నిచ్చింది. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది వర్షం కారణంగా ఇబ్బంది పడ్డారు. ఓటర్లు కూడా వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. బోయలగూడెం, ఇందువాసి, చాగదోణ ప్రాంతాల్లో కాస్త ఎక్కువగానే వర్షం కురిసింది. ఈ వానకు బోయలగూడెం–చిన్నోనిపల్లె గ్రామాల మధ్యన ఉన్న వాగులు పొంగిపొర్లాయి. వేసవి దుక్కులు దున్నేందుకు రైతులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడనున్నది.


బోయలగూడెం సమీపంలో జోరుగా పారుతున్న వాగు నీరు


బోయలగూడెం-చిన్నోనిపల్లె గ్రామాల మధ్యన నీరు పారుతున్న వాగు

పోలింగ్‌తో స్తంభించిన వ్యాపారాలు


అలంపూర్‌లో పోలింగ్ సందర్భంగా మూసి ఉన్న దుకాణ సముదాయాలు

అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌తో వ్యాపారాలు స్తంభించిపోయాయి. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం నిర్వహించారు. పోలింగ్ జరిగే కేంద్రాల సమీపంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు పలు ఆంక్షలు విధించారు. దీంతో ప్రధానంగా మున్సిపాలిటీలు, పట్టణ కేంద్రాల్లో అత్యధికంగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్ల లోపు ఉన్న దుకాణాలు, ప్రధాన రహదారిల్లో దుకాణా సముదాయాలను బంద్ చేయించారు. దీంతో వ్యాపార లావాదేవీలు పూర్తిగా నిలిచాయి. పట్టణాల్లో హోటళ్లు, టీ కొట్లు, చిరు వ్యాపారాలను సైతం బంద్ చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఇతర ప్రైవేట్ వాహనాలతో తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రి హోమం

మల్దకల్: మండలంలో మల్దకల్ వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారి గాయత్రిహోమం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.


గాయత్రిహోమం నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు